క్లుప్తంగా

అనుమతి తప్పనిసరి



దాచేపల్లి : ఎన్నికల ప్రచారాలకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తహసీల్దార్ పి.గీతావాణి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచారాలకు, సభలు, ర్యాలీలు, ఊరేగింపులకు సువిధ యాప్‌లో 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని, ఎన్నికల కమిషన్ పరిశీలన చేసిన తరువాత ఆర్వో అనుమతులు మంజూరు చేస్తారని చెప్పారు. ఎన్నికల ప్రచార సామగ్రికి సీఈవో, మైక్‌కి అనుమతులు జిల్లా కలెక్టర్ ఇస్తారని వివరించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించవద్దని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.

నేడు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు

సత్తెనపల్లి: బార్ అసోసియేషన్‌లో ఉపాధ్యక్ష, జాయింట్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూనియర్ పదవులకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 141 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గురువారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. 5.00 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి అనంతరం గెలుపొందిన అభ్యర్థులకు డిక్లరేషన్ అందిస్తారు. బార్ అసోసియేషన్ ఎన్నికల వ్యవహారం ఏకపక్షంగా జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీనియర్ ఆకుల నాగార్జున, లైబ్రేరియన్ కోటగిరి లక్ష్మణ గోవింద చారిలు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి ఎన్నికల అధికారి సయ్యద్ అబ్దుల్ రహీంకు రాజీనామా పత్రాలను అందించారు. ఉపాధ్యక్ష పదవికి బరిలో నిలిచిన బాణావత్ అమరయ్య నాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూనియర్ పదవికి బరిలో నిలిచిన ఉడుముల విద్యాసాగర్ రెడ్డి ఎన్నికల నుంచి తప్పుకుంటునట్లు ప్రకటించి ఎన్నికల అధికారికి లేఖలు అందించగా నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయింది కనుక చేయగలిగేది ఏమి లేదని ఆయన చెప్పారు. ఈ నెల 25న నామినేషన్ల ఉపసంహరణ సాయంత్రం 5 గంటల వరకే జరగాల్సి ఉండగా రాత్రి 7 గంటల వరకు సమయం కేటాయించడం వల్లనే గంగూరి అజయ్‌కుమార్‌ను బలవంతంగా నామినేషన్ ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ఎన్నికల అధికారి సయ్యద్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ నామినేషన్ల ఉపసంహరణకు మొదట సమయం ఫిక్స్ చేయలేదని, ఉపసంహరణకు ఎవ్వరూ రాకపోవడంతో సాయంత్ర 6.30 గంటలలోగా ఉపసంహరించుకోవాలని సమాయం ఫిక్స్ చేశానన్నారు. ఈ క్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి రాజీ చర్చలు జరుగుతున్నాయని, కొంత సమయం కావాలని సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య కోరడంతో అదనంగా మరో 20 నిమిషాలు ఇచ్చానన్నారు. 6.50 గంటలకు గంగూరి అజయ్‌కుమార్ తన నామినేషన్ ఉపసంహరించుకున్నారన్నారు. దీనిలో తాను ఏకపక్షంగా వ్యవహరించలేదన్నారు.

బాలికలకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం ఆధ్వర్యంలో బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా బ్రాహ్మణపల్లి యూపీ పాఠశాల విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రెండు పాఠశాలల్లో కౌమారదశలో ఉన్న 40 మంది బాలికలకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేశారు. 20 మంది బాలింతలు, గర్భిణులకు కూడా రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నీలకంఠేశ్వరరావు, డీపీవో ఒన్నూరు బాషా, బీపీహెచ్ఎన్వో సురేఖ, డాక్టర్ వెంకట కృష్ణకుమార్, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

క్రోసూరు: ఎన్నికలు, ఓటు, ఓటు హక్కు ద్వారా దేశానికి మంచి పాలకులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కాబట్టి ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగపరచుకుని తమ ప్రతినిధిని తప్పనిసరిగా ఎన్నుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శ్రీరాములు అన్నారు. బుధవారం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్(సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం)పై అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా సాంబశివరావు నిర్వహించగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో ఎన్నికలు శాంతియుతంగా జరుగుతాయన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు పొంది తప్పనిసరిగా సద్వినియోగ పరచుకోవాలన్నారు. తమకు నచ్చని అభ్యర్థి ఉంటే నోటా ఆప్షన్ కూడా ఉంటుందన్నారు. ఏడాదిలో ఎప్పుడైనా ఓటుకు దరఖాస్తు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రతి నాలుగు నెలలకు విచారణ జరిపి ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఓటు శక్తివంతమైన ఆయుధమని అన్నారు. కళాశాలలో ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సుల భద్రత గదులను పరిశీలించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ తులసీరాం, ఏఆర్వో (క్రోసూరు తహసీల్దార్) ఎం.సువర్ణ, పాలిటెక్నికల్ కళాశాల హెచ్‌వోడీలు ఆర్వీఎల్ ప్రసన్నరాణి, డేవిడ్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊరూరా అభివృద్ధి.. ప్రజల వద్దకే సేవలు

- జగనన్న పాలనలో సంక్షేమాభివృద్ధి వికాసం
- సచివాలయ వ్యవస్థతో గ్రామంలోనే సమస్యల పరిష్కారం
- రైతన్నకు అండగా నిలుస్తున్న ఆర్బీకేలు
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లతో అందుబాటులోకి మెరుగైన వైద్యం
- ఎస్సీ, ఎస్టీ కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన
- నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు

గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయాలతో పల్లెల రూపురేఖలు మారిపోయాయి. ఐదు సంవత్సరాల వైఎస్సార్‌సీపీ చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలతో పరిపాలన పల్లెకు చేరింది. గ్రామంలో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు చేరాయి. దశాబ్దాలుగా ఏ చిన్న పని, సమస్య పరిష్కరించుకోవాలన్నా సుదీర్ఘ ప్రాంతాలైన మండల, నియోజకవర్గ కేంద్రాలకు రోజుల తరబడి తిరుగుతూ వ్యయ ప్రయాసలతో ప్రజలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ఉన్న ఊళ్లోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. గ్రామాలను అభివృద్ధి చేస్తూ గ్రామ స్వరూపాన్ని మార్చివేసిన పరిస్థితులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాచర్ల రూరల్: జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారు. గ్రామ స్థాయిలోనే పరిపాలనను వికేంద్రీకరించేందుకు గ్రామ స్థాయిలోనే సచివాలయ, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ఊరూరా శాశ్వత భవనాలు నిర్మించి ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చారు. గ్రామ సచివాలయ వ్యవస్థను అమలులోకి తీసుకొచ్చి ప్రభుత్వ పాలనను కొత్త పుంతలు తొక్కించారు. ప్రతి 2 వేల మంది జనాభాకు ఒక గ్రామ/ వార్డు సచివాలయం ఏర్పాటు చేసి సంక్షేమ ఫలాలు నేరుగా వారి వద్దకే చేర్చారు. రైతన్నల ఇబ్బందులకు చెక్ పెడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్బీకేలను ఏర్పాటు చేశారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు వారున్న గ్రామంలోనే మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రాథమిక వైద్యానికి జీవం పోశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరుకొని అధ్వాన్నంగా ఉన్నా వాటిని పట్టించుకునేవారు కాదు. పేద విద్యార్థులు విద్యనందుకొనే ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను మార్చారు. బ్లాక్‌బోర్డు స్థానంలో డిజిటల్ క్లాస్‌లు ఏర్పాటు చేశారు.



వైఎస్సార్ విలేజ్ క్లినిక్



రైతు భరోసా కేంద్రం

- ఒక్కో గ్రామ/వార్డు సచివాలయానికి రూ.40 లక్షలు
- రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు



నాడు–నేడు ద్వారా ఆధునీకరించిన ఎంపీపీ స్కూల్

- వైఎస్సార్ క్లినిక్‌కు రూ.20 లక్షలు ఏర్పాటు చేయటమే కాకుండా
- నాడు–నేడు ద్వారా ఎంపీపీ పాఠశాలలో, అంగన్ వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించి వాటి రూపురేఖలు మార్చివేశారు.
- రూ.10 లక్షలతో అదనపు తరగతి గదులు
- కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ద్వారకాపురి ఎంపీపీకి రూ.15 లక్షలతో పాఠశాల రూపురేఖలు మార్చివేశారు.
- ఎస్సీ కాలనీలో రోడ్లు, నీటి వసతి కోసం రూ.26 లక్షలు,
- అంబేడ్కర్ కాలనీకి రూ.70 లక్షలు,
- ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.10 లక్షల నిధులందించి, కాలనీ స్వరూపాన్ని మార్చివేశారు.
- జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.30 లక్షలు
- గంగ్రకోట చెరువు కట్ట నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించి గ్రామ స్వరూపాన్ని మార్చివేసిన ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీకే దక్కుతుంది.



ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు

రూ.4.70 కోట్లతో గ్రామాభివృద్ధి...



చరిత్రలో ఏ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి కేటాయించని నిధులు జగనన్న ప్రభుత్వం కేటాయించింది. రూ.4.70 కోట్లతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాం. దశాబ్దాల కాలంగా వెనుకబాటుతనాన్ని ఎదుర్కొంటున్న ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించి, మంచినీటి సమస్య పరిష్కారం నిమిత్తం బోర్లు వేసి నీటి ఎద్దడి నివారించాం. ప్రజల వద్దకే అధికారులను తీసుకొచ్చి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు తెచ్చిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ.

–ఒరుగంటి జయప్రకాష్‌రెడ్డి, సర్పంచ్

కాలనీలో మౌలిక వసతులు కల్పించిన ఘనత జగనన్నదే...



ఎన్నో ఏళ్ళ నుంచి మా కాలనీలో రోడ్లు, కాలువలు లేక ఇబ్బంది పడ్డాం. జగనన్న ప్రభుత్వంలో రోడ్లు, కాలువలతో పాటు కమ్యూనిటీ హాలు నిర్మాణం జరిగింది. చిన్న చిన్న సమస్యలు సైతం పరిష్కరించుకునేందుకు సచివాలయాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. జగనన్న ఋణం తీర్చుకొనేందుకు మళ్లీ ఆయనకే అండగా ఉంటాం.

–ఇలాసాగరం నర్సమ్మ, అంబేడ్కర్ కాలనీ, కొత్తపల్లి

పింఛన్, ఆసరా అందించిన జగన్‌కే మా మద్దతు...



ప్రతి వేసవి కాలంలో మంచినీటి సమస్యను ఎదుర్కొంటుంటాం. ఈ వేసవి ముందుగానే మా కాలనీలో బోరు, మోటారుతో పాటు ట్యాంకులు కూడా నిర్మించారు. సుదీర్ఘ కాలంగా వెంటాడుతున్న మంచినీటి సమస్యను తీర్చారు. ఇంటివద్దకే పింఛన్, అనుకున్న సమయానికి వైఎస్సార్ ఆసరా, డ్వాక్రా ఋణాలను అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తోడుగా నిలుస్తాం.

– కొమ్ము లక్ష్మమ్మ, ఎస్సీ కాలనీ, కొత్తపల్లి

రాజకీయ పక్షాలు ఎన్నికల కోడ్‌కు సహకరించాలి



రెంటాల గ్రామంలో విగ్రహానికి ముసుగు వేయిస్తున్న నోడల్ ఆఫీసర్ పెదప్రోలు శంకర్‌రావు

రెంటచింతల: మండలంలోని రాజకీయ పక్షాలు ఎన్నికల కోడ్‌కు సహకరించి 2024 మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయాలని నోడల్ ఆఫీసర్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని రెంటాల, మంచికల్లు గ్రామాలలో పర్యటించి విగ్రహాలకు ముసుగులు వేయించి మాట్లాడారు. గ్రామాలకు చెందిన వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చి వారి సహకారంతో ఇళ్లపై, ప్రయివేటు ఆస్తులపై, షాపుల గోడలపై ఉన్న రాజకీయ నేతల స్టిక్కర్లు, లోగోలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా విగ్రహాలకు ముసుగులు వేయకపోయిన, పార్టీల రంగులకు వెల్లవేయకపోయిన, రాజకీయ నాయకుల ఫొటోలు ఉన్నా తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే వెంటనే వాటిని తొలిగించేందుకు చర్యలు చేపడతామన్నారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రేఖ ప్రియదర్శిని, కార్యదర్శి ఇస్లావత్ నాగులునాయక్, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

పిడుగురాళ్ల: పట్టణంలోని పదో తరగతి పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలోని 9 పరీక్ష కేంద్రాల్లో, మండలంలోని 2 పరీక్ష కేంద్రాల్లో జరిగిన సోషల్ స్టడీస్ పరీక్ష విద్యార్థులు ప్రశాంతంగా రాశారని పిడుగురాళ్ల ఎంఈవో ఏ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొత్తం 11 పరీక్ష కేంద్రాల్లో 2,097 మంది విద్యార్థులకుగాను 2,045 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 52 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో తెలిపారు.

ఉద్యోగులు ఎన్నికల నిబంధనలు పాటించాలి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో ఎ.శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్: ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం, ఇతర జీతభత్యాలు తీసుకునే ఉద్యోగులు ఎవరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని, అలాంటి వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 31లోపు కొత్త ఓట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువుందని, ఎన్నికల నిబంధన ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేలకు మించి నగదుతో ప్రయాణం చేయకూడదని, బంగారం వంటి వాటికి తగిన ఆధారాలు చెక్‌పోస్టు చూపించాలన్నారు. ఆధారాలు లేని నగదు, బంగారం సీజ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికి 635 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని అవసరమైతే మరికొందరిపై బైండోవర్ కేసులు నమోదు చేసే అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బూత్ కన్వీనర్ కొర్ల వెంకటేశ్వరరావు, ఇతర పార్టీ నాయకులు, తహసీల్దార్ మంజునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాస్, ఎన్నికల డీటీ జాని బాషా, ఏఎస్‌వో ప్రభాకర్, సీనియర్ అసిస్టెంట్ షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయండి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న డీఎల్‌పీవో రమణయ్య

మాచవరం: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని డీఎల్‌పీవో పి.రమణయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన ఇంటి పన్ను వసూలు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో ఇంటి పన్ను వసూలు 57 శాతం మాత్రమే జరిగిందని, ఈ నెలాఖరులోగా నూరు శాతం ఇంటి పన్ను వసూలుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. సమావేశంలో ఎంపీడీవో బి.సురేష్, ఈవోపీఆర్డీ వెంగళరావు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమం



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

రెంటచింతల: విద్యాభివృద్ధితో పాటు వివిధ రంగాలలో నైపుణ్యం ప్రదర్శించిన వారిని ఎన్‌హెచ్ఆర్ ఫౌండేషన్ ప్రోత్సహిస్తూ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు అన్నారు. బుధవారం నారాయణపురం హనుమంతు జయంతి సందర్భంగా స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2022–23 సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు అవార్డులను అందజేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి నిర్దిష్టమైన లక్ష్యంతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియాకు విద్యార్థులు దూరంగా ఉండి ప్రణాళికాబద్ధంగా లక్ష్యం చేరుకోవడానికి కృషి చేయాలన్నారు. ముందుగా హనుమంతురావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం శ్రీనివాసరావు, ఎన్‌హెచ్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ డి.కిరణ్‌కుమార్, దమ్మాలపాటి రామకోటయ్య, సభ్యులు పద్మావతి, ఎస్.చినములకయ్య, సాయి ఈశ్వర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోండి



గురజాల : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలని సీఐ బాలకృష్ణ సూచించారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ పల్లపురాజు ఆధ్వర్యంలో పులిపాడు, గురజాల పట్టణాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ (కవాతు ప్రదర్శన) బుధవారం సాయంత్రం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎవరూ భయపడాల్సిన పనిలేదని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా పాల్గొని వారి ఓటు హక్కుతో మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించాలన్న సందేశాన్నిచ్చారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు వేసుకునే వాతావరణాన్ని కల్పించడమే లక్ష్యంగా సాయుధ బలగాల పనితీరున్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

కారెంపూడి: కారెంపూడి మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన 15 కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వీరంతా మాచర్ల తరలివెళ్లి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి వెంకటరామిరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరు పార్టీ బలోపేతానికి కృషి చేసి రానున్న ఎన్నికల్లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అత్యధిక మెజార్టీతో ఐదవసారి ఎమ్మెల్యేగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కొండపల్లి వెంకటేశ్వర్లు, పుసులూరి శ్రీకాంత్, యల్నాటి శ్రీను, అమరావతి నాగ బ్రహ్మాచారి, బందారు రాముడు, బందారు లక్ష్మణుడు, సంకా అంజయ్య, శింగంశెట్టి ఆంజనేయులు, మేకా హనుమంతరావు, పాశం బ్రహ్మయ్య, కూరాకుల చిన బ్రహ్మయ్య, శింగంశెట్టి శ్రీను, శెట్టి చెన్నకేశవులు, టి.పిచ్చెయ్య, బి.నాగరాజు కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, ఇరికెదిండ్ల లాజర్, ఎంపీటీసీ ఇరుకులపాయ శ్రీను, కూరాకుల మల్లిఖార్జున పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



రెంటచింతల: మండల పరిధిలోని పలు గ్రామాలలో బుధవారం మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ(ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె.పాపయ్య నేతృత్వంలోని బృందం ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ 2024 మే 13 ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఈ బృందం మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా ఈ తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. వాహనాలలో నగదు, మద్యం, బంగారం, వెండి వస్తువులు తరలింపును నియంత్రించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలు కూడా ఎక్కడైనా ఎన్నికల నియమ నిబంధనలకు వ్యతిరేక పనులకు పాల్పడుతున్న వారిపై ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన సి–విజిల్ యాప్ ద్వారా సమాచారం ఇచ్చినట్లయితే వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో వీడియో తీయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రేఖ ప్రియదర్శిని, కార్యదర్శి ఇస్లావత్ నాగులునాయక్, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

వసతులు ఉన్నాయి.. వైద్య సేవలు లేవు



పణిదం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎమ్‌హెచ్‌వో రవి

ముప్పాళ్ళ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24 గంటల వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించినా సిబ్బంది పనితీరులో మాత్రం మార్పు కనిపించక పోవటాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆకస్మిక తనిఖీలో గుర్తించారు. డీఎమ్‌హెచ్‌వో బీ రవి మంగళవారం రాత్రి గం.10.30 గంటలకు ముప్పాళ్ళ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన వైద్య సిబ్బంది ఎవరూ కనిపించక పోవటంతో వెనుదిరిగారు. వాచ్‌మెన్ మాత్రమే అందుబాటులో ఉండటాన్ని గుర్తించారు. పీహెచ్‌సీలో మొత్తం ముగ్గురు స్టాఫ్‌నర్స్‌లకు గాను రాత్రి డ్యూటీలో ఉండాల్సిన స్టాఫ్‌నర్స్ విధుల్లో లేకనపోవటాన్ని గుర్తించారు. తనిఖీలో గుర్తించిన అంశాలపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 24 గంటల ఆసుపత్రిలో ఎవరో ఒకరు వైద్య సేవలందించాల్సి ఉందని, ఎవరూ లేకపోవటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం పీహెచ్‌సీలలో వైద్య సేవలందించేందుకు ఎన్నో వసతులు కల్పించిందని చెప్పారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జయకృష్ణ మాత్రం భిన్నంగా స్టాఫ్‌నర్స్ వీక్లీ ఆఫ్ కావటంతో విధులకు హాజరుకాలేదని సమాధానం చెబుతుండటం గమనార్హం. ఎవరో ఒకరు విధుల్లో ఉండాలి కదా అని ప్రశ్నిస్తే సమాధానం దాటవేస్తున్నారు. అనంతరం సత్తెనపల్లి మండలంలోని పణిదం పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన సమయంలో సిబ్బంది అందుబాటులో ఉండటంతో డ్యూటీ రికార్డులు పరిశీలించారు. సిబ్బంది విధుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

కారెంపూడిలో పోలీస్ కవాతు



కారెంపూడి: ఎన్నికలలో ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు శాంతి భద్రతలు కాపాడడానికి మండలంలోని పేటసన్నెగండ్ల, కారెంపూడి గ్రామాలలో కేంద్ర భద్రతా బలగాలు, సివిల్ పోలీసులు బుధవారం రాత్రి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజల్లో భయాందోళనలు లేకుండా ధైర్యం నింపేందుకు కవాతు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ క్రైం లక్ష్మీపతి, గురజాల డీఎస్పీ పల్లపురాజు, ఏఆర్ డీఎస్పీ గాంధీరెడ్డి, ఆర్ఐ గోపీనాథ్, పల్నాడు ఆర్ఎస్ఐ హుస్సేన్, కారెంపూడి సీఐ చిన మల్లయ్య, ఎస్ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో పోలీస్, కేంద్ర బలగాలు భారీగా కవాతులో పాల్గొన్నాయి.